## రైతులకు కష్టాలు మళ్లీ మొదలైతయ్



ఆత్మకూరు : మూడు గంటల కరెంటు ఇస్తామంటున్న కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ కరెంటు కష్టాలు మొదలైతయ్. కాంగ్రెస్ హయాంలో కరెంటు ఎప్పుడో వస్తదో.. ఎప్పుడో పోతదో తెల్వకుండే. దీంతో పంటలు ఎండిపోయేవి. పంట మీద రైతుకు నమ్మకం ఉండేది కాదు. లోకరెంటుతో మోటర్లు కాలిపోయేవి. రాత్రుళ్లు బావుల వద్ద నీళ్లు పెట్టేందుకు వెళ్లి ఎంతో మంది చనిపోయారు. వాటిని గుర్తు చేసుకుంటేనే భయమైతాంది. కాంగ్రెస్ నాయకులు మాట్లాడే తీరు చూస్తే, రైతులను మళ్లీ దగా చేసేటట్లు ఉన్నారు. కేసీఆర్ పాలనలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. 24గంటల కరెంటుతో ఇష్టం వచ్చినప్పుడల్లా పారించుకుంటున్నాం. ఈ సారి కూడా కారు గుర్తుకే ఓటు వేస్తాం.

**- బీరం కొంరారెడ్డి, రైతు, గూడెప్పాడ్**

## పట్వారీ వ్యవస్థను తీసుకొస్తే లంచాలే...



దామెర : కాంగ్రెస్ ధరణిని తీసేసి, పట్వారీలను తీసుకువస్తామని చెబుతోంది. దీంతో మళ్లీ పాత రోజులు వచ్చి లంచాలు పెరుగుతయ్. కాంగ్రెస్ విధానం సక్కగ లేదు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు భూముల వద్ద లొల్లులు, విస్తీర్ణాల్లో తేడాలు, ఒకరి భూమి ఒకరిపై తక్కువ, ఎక్కువలు ఉండేవి. మళ్లీ పట్వారీలను తీసుకువస్తామని ఆ పార్టీ నాయకులు చెప్పడం రైతులను ముంచేందుకే. సీఎం కేసీఆర్ సర్వే నంబర్లను చూసి, పట్టాలు ఇచ్చి రైతు బంధు ఇస్తున్నడు. ధరణిని తీసేస్తే రైతు బంధు డబ్బులు రావు. పెట్టుబడి లేకుండా పోతుంది. కాంగ్రెస్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నం. కేసీఆర్ సార్ తీసుకువచ్చిన ధరణి తప్పనిసరిగా ఉండాలే. లేకపోతే రైతుకు మళ్లీ కష్టాలు వస్తాయి.

**- కేతిపల్లి రాజిరెడ్డి, రైతు ఓగ్లాపూర్**





యువతి పెళ్లి కోసం ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రీధర్‌రెడ్డి

## సీఎం కేసీఆర్ స్ఫూర్తితో పెళ్లికి ఆర్థికసాయం

దామెర, నవంబర్ 29 : సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి, అమలు చేస్తున్న కల్యాణ లక్ష్మిని ఆదర్శంగా తీసుకుని మండలంలోని ఓగ్లాపురంలో గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ కేతిపల్లి శ్రీధర్ రెడ్డి ఓ పేదింటి యువతి కల్యాణం కోసం తనవంతు సాయం అందించారు. గ్రామానికి చెందిన సిలివేరు రాధ, మల్లయ్య దంపతుల కుమార్తె హిమప్రియ వివాహం వచ్చేనెల ఒకటో తేదీన జరుగనుండగా శ్రీధర్‌రెడ్డి మహిళా సంఘం అధ్యక్షురాలు నల్ల సుజాత సమక్షంలో బుధవారం హిమప్రియకు రూ.10,116 నగదు అందజేసి దీవించారు. రెండేళ్లుగా శ్రీధర్‌రెడ్డి గ్రామంలో యువతుల కల్యాణం కోసం సీఎం కేసీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకుని తనవంతుగా సహాయం అందజేస్తుండడంపై గ్రామస్తులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో దామెర రజిని, కిన్నెర రామస్వామి, కీసరి రమేశ్, కిన్నెర రమేశ్, పోరల సతీశ్‌కుమార్, నల్ల శంకర్, కిన్నెర లక్ష్మణ్ పాల్గొన్నారు.

## 4 నుంచి శివలింగ ప్రతిష్ఠాపన మహోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న భక్తులు

దామెర, నవంబర్ 29 : మండలంలోని వెంకటాపురంలో వచ్చే నెల 4 నుంచి శ్రీశివపంచాయతన దేవాలయంలో శివలింగ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, సర్పంచ్ పున్నం సంపత్-రజిత తెలిపారు. ఈ మేరకు బుధవారం మహోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. 4న అఖండ దీపారాధన, కలశపూజ, గణపతిపూజతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 5, 6వ తేదీల్లో ప్రత్యేక పూజలు, 7న శివలింగప్రతిష్ఠాపన తదితర పూజలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో మోర్తాల అంకూస్, మోర్తాల శ్రీనివాస్, బొనగాని రాజు, శ్రీనివాస్, సంపత్‌కుమార్, సదాశివుడు, రమేశ్, రవీందర్, కుసుంబ బాబురావు, రాజ్‌కుమార్, రజినీకాంత్, బాబురావు, శ్రీధర్, నాగరాజు, సిందె రమేశ్, ఇజ్జగిరి రాజు, అర్చకుడు కొలనుపాక సతీశ్ పాల్గొన్నారు.

## గంగదేవిపల్లిని సందర్శించిన ప్రతినిధుల బృందం



గంగదేవిపల్లిలో ప్రతినిధుల బృందం

గీసుగొండ, నవంబర్ 29 : జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిని బుధవారం శ్రీలంక దేశంలోని రెహామా అనే స్వచ్ఛంద సంస్థలో పని చేస్తున్న ప్రతినిధుల బృందం బాల వికాస స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో తిరిగి గ్రామాభివృద్ధిని పరిశీలించారు. అనంతరం గ్రామాభివృద్ధి గురించి శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి వారికి వివరించారు. బాలవికాస సంస్థ గంగదేవిపల్లి గ్రామం అభివృద్ధికి దిశానిర్దేశం చేసిందన్నారు. అనేక స్వచ్ఛంద సంస్థలు గ్రామాభివృద్ధిలో తమ సహాయ సహకారాలు అందించాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామానికి రూ.10 కోట్ల నిధులను కేటాయించడంతో గ్రామం మరింత అభివృద్ధి సాధించినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ పాల్గొన్నారు.

# పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

- ఈవీఎం మిషన్లతో కేంద్రాలకు చేరిన ఎన్నికల సిబ్బంది
- పోలింగ్ బూత్‌ల వద్ద భారీ బందోబస్తు
- మహిళలకు ఐదు ప్రత్యేక కేంద్రాలు
- నేడే ఓటింగ్

పరకాల, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 239 పోలింగ్ స్టేషన్లు ఉండగా 2,21436మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇందులో మహిళా ఓటర్లు 1,13,154మంది, పురుషులు 1,08,280 మంది, ఇతరులు ఇద్దరు ఉన్నారు. గురువారం ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది బుధవారం సాయంత్రమే పోలింగ్ స్టేషన్లకు చేరుకున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 44 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు ఉండగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మహిళల కోసం మండలానికి ఒక్కటి చొప్పున ప్రత్యేకంగా ఐదు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాగా, ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌వో కే శ్రీనివాస్ పేర్కొన్నారు.

**ఆత్మకూరు మండలంలో..**

ఆత్మకూరు : మండలంలోని పోలింగ్ కేంద్రాలల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ సురేశ్‌కుమార్ తెలిపారు. మండలంలోని 16 గ్రామాల్లో 32 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం ఈవీఎంలతో పోలింగ్ సిబ్బంది, పోలీస్ బందోబస్తు మధ్య పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలో మొత్తం 27,921 మంది ఓటర్లు ఉండగా, అందులో13,588 మంది పురుషులు, 14,333 మంది స్త్రీలు ఉన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందని తెలిపారు. కాగా, ఎవరైనా ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని సీఐ రవిరాజు హెచ్చరించారు. అలాగే, మండలంలోని పోలీంగ్ కేంద్రాలను ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎస్సైలు ప్రసాద్, రాజేశ్‌రెడ్డి పరిశీలించారు.

**దామెర మండలంలో..**

దామెర : మండలంలో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. మండల వ్యాప్తంగా 14 గ్రామాలు ఉండగా 21,705 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 10,574 మంది ఉండగా, 11,131మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికారులు మండల వ్యాప్తంగా 24 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

**నడికూడ మండలంలో..**

నడికూడ : మండల కేంద్రానికి పోలింగ్ బూత్ సిబ్బంది బుధవారం సాయంత్రం చేరుకున్నారు. జడ్పీహెచ్‌ఎస్‌లో 33, 34, 35 బూత్‌లలో నలుగురు చొప్పున సిబ్బంది ఓటింగ్ యంత్రాలతో హాజరయ్యారు. వారికి కావాల్సిసిన సౌకర్యాలను సిబ్బంది సమకూర్చుతున్నారు.

**గీసుగొండ మండలంలో..**

గీసుగొండ : గీసుగొండ మండలంతో పాటు 15, 16వ డివిజన్లలో ఎన్నికల నిర్వహణకు అధికారులు 52 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 50,785 ఓటర్లు ఉండగా 24,801 మంది పురుషులు, 25983 మంది మహిళలు, ఒకరు ట్రాన్స్‌జెండర్ ఉన్నట్లు ఏఆర్‌వో, తహసీల్దార్ రియాజుద్దీన్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అధికారులు మండలాన్ని మూడు రూట్‌లుగా విభజించారు. 312 మంది అధికారులు విధుల్లో పాల్గొంటున్నారు. 520 మంది పోలీసులు బందోబస్తులో ఉంటున్నారు.

**సంగెం మండలంలో..**

సంగెం : మండలంలో ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మంచినీరు తదితర వసతులు కల్పించారు. మండలంలోని 33 గ్రామపంచాయతీలకు 44 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలో 40,224 మంది ఓటర్లు ఉండగా పురుషులు 19,888, స్త్రీలు 20,336 ఉన్నారు. సజావుగా ఎన్నికలు జరిగేందుకు పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై ఎం భరత్ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.




పరకాల : పోలింగ్ స్టేషన్‌కు వస్తున్న పోలింగ్ సిబ్బంది



ఆత్మకూరు : అక్కంపేటలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎంపీడీవో



ఆత్మకూరు : కటాక్షపురంలో..



ఆత్మకూరు : హౌసుబుజుర్గులో..



నడికూడ : మండల కేంద్రంలో..



గీసుగొండ : కొమ్మాల పోలింగ్ కేంద్రంలో..



సంగెం : మండల కేంద్రంలో..